# బిగుసుకున్న మేఘం

చిటపటా రాలుతున్న చినుకులకి తల తడవకుండా పైట కప్పి వడివడిగా మాతా కుటీర్ వైపు అడుగులేసి గదిలోకి వచ్చి కుర్చీలో కూర్చుని చేతులపై నిల్చిన చిన్ని చిన్ని వర్షపు బిందువులని కర్చీఫ్‌తో అద్దింది రేణుక.

టేబుల్‌పై వున్న విజిటింగ్ కార్డ్సు అటెండర్‌కి అందించి ఒక్కొక్కర్నే లోపలికి పంపించమంది.

మాతా కుటీర్ - 'హోమ్ ఫర్ ఏజ్డ్' రేణుక భర్త రాజేంద్ర ప్రోత్సాహంతో ఈ వృద్ధుల శరణాలయాన్ని స్థాపించింది. అటెండర్ ఒక్కొక్కర్నే లోపలికి పంపిస్తున్నాడు. అప్లికేషన్ ఇస్తూ తమ తల్లితండ్రులని ఎందుకు హోమ్‌లో జాయిన్ చెయ్యాలనుకుంటున్నారో ఒక్కొక్కరూ వివరిస్తుంటే రేణుక తన గుండ్రని కళ్లల్లో ఆశ్చర్యాన్ని దాచి వింటుంది. రోజూ వింటున్న కారణాలైనా ఎప్పటికప్పుడు కొత్తగానే వుంటాయి. రాత్రిపూట రాజేంద్రకి అవన్నీ చెపుతూ "ఎలా మనసొప్పుతుందో ఇలా చేర్పించడానికి" అంటూ విస్మయాన్ని వ్యక్తం చేయటం, కుటుంబ సంబంధాల్లో రోజురోజుకీ పెరుగుతున్న యాంత్రికత గురించి ఆమెకి రాజేంద్ర వివరించటం వాళ్ల దినచర్యలో ఓ భాగంగా మారిపోయింది.

ఆఖరిగా లోపలికి వచ్చిన వ్యక్తి రేణుకని చూసి బోల్డంత ఆశ్చర్యపోయి "అరే రేణూ" అన్నాడు.

ఆమెకూడ అతన్ని గుర్తించి, రవ్వంత నిర్వేదంతో "ఓ మధుకర్ బాగున్నావా?" అని పలకరించింది.

"నువ్విక్కడున్నావేంటి?" విస్మయంగా అడిగాడు.

"నేనిక్కడుండటంలో వింతేంలేదు. కాని నీకీ హోమ్‌లో పనేంటి?" చిర్నవ్వుతో అడిగింది.

"చాలా పనుంది. హమ్మయ్య ఎంతో కష్టపడాల్సి వస్తుందనుకున్నాను, ఇందులో జాయిన్ చేయించటానికి. నువ్వున్నావుగా నా సమస్య తీరిపోయింది" రిలీఫ్‌తో అన్నాడు మధుకర్.

"ఎవర్ని జాయిన్ చేయిస్తున్నావ్?"

"అమ్మని" చాలా సాధారణంగా చెప్పాడతను.

"ఎందుకు?"

"ఇంట్లో పెద్ద న్యూసెన్స్ అయిపోయిందనుకో" అన్నాడు కారణాలు చెప్పకుండా.

"ప్రాక్టీస్ పెట్టావా?"

"ఆఁ ముగ్గురు అసిస్టెంట్స్ వున్నారు" గర్వంగా చెప్పాడు.

అతను లాయర్.

రేణుక వాచ్‌వైపు చూస్తూ "సాయంత్రం మా ఇంటికి రా" అంది.

"రాజేంద్ర ఎలా వున్నాడు?"

"రాజాలా" చిర్నవ్వుతో అందామె.

"అమ్మ విషయం"

"అప్లికేషన్ ఇచ్చావుగా" ముక్తసరిగా అందామె.

మధుకర్ వెళ్లిపోయాడు.

రేణుక పనిలో నిమగ్నమవటానికి ప్రయత్నిస్తున్నా గతం గలగలలు విన్పిస్తూనే వున్నాయ్.

★ ★ ★

రూమ్ నెంబర్ 9.

లేడీస్ హాస్టల్.

మహారాణిపేట.

విశాఖపట్నం - యవ్వనపు ప్రేమలా మహా ఉత్సాహంగా తుళ్లి తుళ్లి పడుతున్న సముద్ర కెరటాలని కిటికీ దగ్గర నిలబడి జడ అల్లుకుంటూ చూస్తోంది రేణుక.

"ప్రేమలేఖ ఎలా రాయాలోయ్?" రేణుకని అడిగింది గిరిజ. ఇద్దరూ లా స్టూడెంట్స్. హాస్టల్లో రూమ్మేట్స్.

"ఎవరికి?"

"అబ్బాయికి. ఇంకెవరికి రాస్తాం?" వింతగా రేణుకని చూస్తూ అంది గిరిజ.

"అబ్బాయిలకే కాని అందరికీ ఒకేలా ఎలా రాస్తాం? పాత్రని బట్టి ఆకారం మారేలా అబ్బాయిని బట్టి ప్రేమలేఖ మారుతుందోయ్" ప్రాంతాన్ని బట్టి ఉపన్యాసాన్ని చెప్పే రాజకీయవేత్తలా చెప్పింది రేణుక.

గిరిజ జవాబు కోసం ఆగకుండా "సపోజ్ ఆ కుర్రాడు కళాకారుడైతే ఓపెన్ ఎయిర్ థియేటర్లా, వ్యాపారవేత్త అయితే స్టాక్ ఎక్స్ఛేంజిలా, శాస్త్రవేత్త అయితే లాబ్‌లా, డాక్టర్ అయితే ఆపరేషన్ టేబుల్లా వుండాలి ప్రేమలేఖ. ఇంతకీ నువ్వు రాయబోయే కుర్రాడు ఏ కేటగిరి?" పార్టీ టికెట్ ఇచ్చే రాజకీయ నాయకురాలిలా ప్రశ్నించింది రేణుక.

"కళాకారుడు" పార్టీ టికెట్టు కోసం ఎదురు చూస్తున్న కార్యకర్తలా నమ్రతగా చెప్పింది గిరిజ.

"కవా? రచయితా? చిత్రకారుడా?"

"అమ్మతల్లీ! నీకో నమస్కారం. చిత్రకారుడు. మధుకర్‌కి" విసుగ్గా అంది గిరిజ.

"ప్రేమలేఖ రాసేవాళ్లకి సహనం చాలా అవసరం" శాంతంగా అంది రేణుక.

"ఇంతకీ నాకేమైనా సాయం చేసేదుందా?"

"ప్రేమకి ముఖ్యంగా కావల్సింది ఆత్మవిశ్వాసం. వ్యక్తిత్వం. ప్రేమలేఖ రాయలేని దానివి, రేప్పొద్దున శుభలేఖ ఎలా రాస్తావ్? పికాసో గురించే రాస్తావో, పిండివంట గురించే రాస్తావో అదినీ ఇష్టం. ఏది రాసినా అది నీ సొంతమై వుండాలి. రాజేంద్ర ఎదురు చూస్తుంటాడు. నే వెళుతున్నా" అంటూ గదిలోంచి రివ్వున వెళ్లిపోయింది రేణుక. గిరిజ నుదురు చిన్నగా కొట్టుకొని పెన్, పేపర్ అందుకుంది.

★ ★ ★

ఆర్టీసీ డిపో వెనకున్న సముద్రపు ఇసుకలో నడుస్తూ స్వయంగా ఈత కొట్టటం నేర్చుకుంటున్న జాలరి పిల్లలని చూస్తూ రేణుక గిరిజ ప్రేమలేఖ సంభాషణ చెప్పింది రాజేంద్రకి. రాజేంద్ర యం.ఏ. లిటరేచర్ చేస్తున్నాడు. మధుకర్, రాజేంద్ర రూమ్మేట్స్.

"మధుకి చెప్పనా?" అడిగాడు రాజేంద్ర.

"వద్దు. వాళ్లిద్దరూ డిసైడ్ చేసుకోనీ" అందామె.

"రేపు మధుకర్ చిత్ర ప్రదర్శన వుంది వస్తావా?" అడిగాడు.

"ఎక్కడ?"

"టవున్ హాల్లో"

"వస్తాను".

★ ★ ★

సాయంత్రం ఏడు గంటలు.

మిలమిల మెరిసే తారల్లా రేణుక, గిరిజ టవున్ హాలంతా తిరిగి మధుకర్ చిత్రాలు చూస్తున్నారు. వాళ్లిద్దరికి ఎప్పుడెప్పుడు ఏది ఎవరడిగితే వేశాడో మధుకర్ వివరిస్తున్నాడు.

"ఇప్పుడేం వేస్తున్నారు?" అడిగింది గిరిజ.

"మా మావయ్య సాకీని, మా హాస్టల్లో యం.యస్సీ. విజయ్, మేఘసందేశం అడిగాడు. అదే వేస్తున్నాను" అన్నాడతను.

"ఎవరైనా అడిగితే తప్ప నీ అంతట నువ్వేం వెయ్యవా?" అడిగింది రేణుక.

"అంటే?"

"నీకెప్పుడూ ఇది వెయ్యాలి. అది వెయ్యాలి అన్పించలేదా?" అడిగింది రేణుక.

"నాకెందుకు?"

"నీకోసం నువ్వేం వేసుకోవా?"

"అబ్బా రేణూ, మా మధు పరుల సంతోషం కోసం మాత్రమే పాటుపడతాడు" నవ్వుతూ సంభాషణని కట్ చేశాడు రాజేంద్ర.

"నీకు వ్యక్తిత్వం లేదు" అని మధుకర్ ని రేణుక అవేస్తుందేమోనని రాజేంద్ర బెంగ.

హాల్ నుండి వస్తూ వస్తూ గిరిజ తన ప్రేమలేఖని మధుకర్ కి ఇచ్చింది.

★ ★ ★

"సో, గిరిజ గారి ప్రేమని ఆమోదించావన్నమాట" అన్నాడు రాజేంద్ర బీచ్ నుండి వచ్చిన మధుకర్ తో".

"ఆఁ".

"నీ ప్రేమకి ప్రేరణ ఏమిటి?"

"ఆమె నన్ను ప్రేమించిందిగా"

"అంటే?"

"రిజెక్ట్ చేస్తే ఏమైనా అనుకుంటుందని" అమాయకంగా చెప్తున్న మధుకర్ ని చూస్తే జాలేసింది రాజేంద్రకి.

"ఇష్టం లేకపోతే ఆమెకి చెప్పొచ్చుగా?"

"ఇష్టం లేకపోవటం ఏంటి? ఆమెకి నేనంటే ఇష్టంగా. అందుకే నాకూ ఇష్టమే" అన్నాడు మధుకర్.

"ఇదేం ఇష్టం" అనుకున్నాడు రాజేంద్ర.

★ ★ ★

రాజేంద్ర పరీక్షలు అయిపోయాయి. అతనికి ఓ ప్రైవేట్ కాలేజీలో జాబ్ వచ్చింది. రేణుకకి మరో ఏడాది చదువు వుంది. ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఇరువైపు పెద్దలూ ఒప్పుకోలేదు. చిన్న ఇల్లు తీసుకుని కాపురం పెట్టారు.

ఆ వేసవి సాయంత్రం రేణుక మల్లెలు మాల కడుతూ "రెండ్రోజులు విజయనగరం వెళదామా?" అంది.

"ఏం?" అడిగాడు రాజేంద్ర.

"గిరిజ రమ్మని రాసింది. సెలవులు అయ్యేలోగా ఒకసారి రమ్మంది"

"సరే" అని అతనంటుండగా మధుకర్ వచ్చాడు. చేతిలో శుభలేఖలు.

"ఎవరిది పెళ్లి?" అడిగింది రేణుక.

"నాదే"

"నీదా? గిరిజ నుండి ఇవాళే ఉత్తరం వచ్చింది. ఏం రాయలేదే?" ఆశ్చర్యంగా అంది

రేణుక.

"గిరిజతో కాదు" నెమ్మదిగా అన్నాడు మధుకర్.

"మరి" ఆశ్చర్యంగా అందామె.

"శశిబిందు. అమ్మా వాళ్లు చూసిన సంబంధం".

"మీ ఇద్దరేమైనా దెబ్బలాడుకున్నారా?" అడిగాడు రాజేంద్ర.

"మీకు తెలుసుగా. అమ్మ నాన్నకి నేనొక్కడినే. వాళ్లకి ఇష్టం అయిన పెళ్లి చేసుకోపోతే బాధపడతారు" అన్నాడతను.

"గిరిజ బాధపడదా?" కోపంగా అంది రేణుక.

మధుకర్ మాట్లాడలేదు.

రేణుకకి ఒళ్లు మండిపోయింది.

"మాట్లాడవేం?" అందామె.

"పేరెంట్స్‌ని కష్టపెట్టటం ఇష్టంలేక ఒప్పుకున్నాను. అయినా మా పెళ్లికి వాళ్లింట్లో కూడా ఒప్పుకోరు" అన్నాడు మధుకర్.

"ఆ విషయం ఎప్పుడో తెలుసు కదా" అందామె.

మౌనంగా వుండిపోయిన మధుకర్‌ని చూస్తుంటే ఆమెకి కోపం వచ్చింది.

వెళతానని మధుకర్ బయలుదేరుతుంటే "ఇదిగో ఈ శుభలేఖ పట్టుకు పో. మేం పెళ్లికి రావటంలేదు. గిరిజకి తోడుగా వుంటానీ సమయంలో" అందామె.

మధుకర్ ముఖం వెలవెలబోయింది.

రాజేంద్రకి మధుకర్ చేసిన పని నచ్చలేదు. అయినా అతను రేణుకలా బయటికి తన భావాలని వెలిబుచ్చడు. అతను రేణుకని వారించలేదు.

★ ★ ★

రేణుక చదువు పూర్తి అయింది. రాజేంద్ర, రేణుక వేదాపురం వచ్చేసారు. మధుకర్‌తో రేణుక, గిరిజ పూర్తిగా మాట్లాడటం మానేసారు. గిరిజ హైదరాబాద్‌లో ప్రాక్టీస్ పెట్టింది. ఆ తర్వాత ఇన్నేళ్లకి మధుకర్ కన్పించాడు. కాలం చాలా విషయాలను మరిపిస్తుంది. కదా. ఆనాటి రేణుక మీద కోపం మర్చిపోయి ఈనాడు ఏమాత్రం సందేహించకుండా తల్లిని హోమ్‌లో జాయిన్ చెయ్యాలనే విషయం ఆమెకి చెప్పాడు మధుకర్.

గిరిజ జీవితంలో సెటిల్ అయినా, ఆరోజుల్లో ఆమె అనుభవించిన మానసిక క్షోభ మాత్రం రేణుకకి అప్పుడప్పుడు గుర్తు వస్తూనే వుంది.

సాయంత్రం ఏడు గంటలు.

ఇంటిముందున్న గుల్‌మొహర్ చెట్టు కింద కేన్ చెయిర్స్ వేసింది రేణుక.

మధుకర్ వచ్చాడు. రాజేంద్ర, అతను కాసేపు ఆనాటి మిత్రులంతా ఏం చేస్తున్నారో మాట్లాడుకున్నారు.

రేణుక "మా అత్తగారు, మామగారు, మా పాప హరిత" అంటూ మధుకర్‌కి

ఇంట్లోవాళ్లని పరిచయం చేసింది.

వాళ్లు లోపలికి వెళ్లిపోయాక "అప్పుడొప్పుకోలేదుగా?" ఆశ్చర్యంగా అడిగాడు మధుకర్.

"మేమే వెళ్లి ఒప్పించి తెచ్చాం. వృద్ధాప్యంలో ఒంటరిగా ఎలా వదిలేస్తాం?" అన్నాడు రాజేంద్ర.

"అమ్మని ఇక్కడ జాయిన్ చేద్దాం అనుకుంటున్నాను" అన్నాడు మధుకర్.

"ఎందుకు?" అడిగాడు రాజేంద్ర.

"శశికి అమ్మతో కలిసి ఉండటం ఇష్టం లేదు. ఈ మధ్యనే నాన్నగారు పోయారు. అప్పట్నుంచి అమ్మ మా దగ్గరే వుంటోంది. కాని ఇద్దరికీ పడటంలేదు" అన్నాడు రాజేంద్ర.

"అత్తగారి పెత్తనం చూపిస్తున్నారా?" అడిగింది రేణుక.

"ఆఁ అదేం లేదు. మేం త్రీ బెడ్‌రూమ్ హౌస్ కట్టుకున్నాం. ఒకటి మాకు, మిగిలిన రెండు పిల్లలకి అమ్మకి ఓ గది ఇవ్వాలి. హాల్లో పడుకోడానికి వచ్చేపోయే ఇల్లు. అదీగాక నేను కోర్టు పనుల్లో బిజీ. పిల్లల చదువులు, గెస్ట్స్, తన ఫ్రెండ్స్‌తో శశి బిజీ. ఆవిడపై అటెన్షన్ పే చెయ్యటం కుదరటం లేదు. పెద్ద వయసు కదా. ఎప్పుడూ ఏదో ఒక రోగం. ఎవరికి టైముంది ఆవిడతోపాటు కూర్చోడానికి? అందుకే శశి ఏదైనా హెూమ్‌లో జాయిన్ చేసేద్దాం అంది. అందుకే వచ్చాను" అన్నాడు మధుకర్.

ఇటువంటి కారణాలతో తల్లితండ్రులని హెూమ్‌లో జాయిన్ చెయ్యటం రాజేంద్ర, రేణుకలకి సాధారణ విషయమే.

"శశిగారితో మాట్లాడి ఎలాగోలా అమ్మని మీదగ్గరే పెట్టుకోకూడదా? ఈ వృద్ధాప్యంలో ఆమెని మానసికంగా ఎందుకు బాధపెడతావ్?" అన్నాడు రాజేంద్ర.

రేణుక చిన్నగా నవ్వి "అదేంటి రాజా, మధుకి ఇలా మానసికంగా క్షోభ పెట్టడం కొత్తేంటి?" అని మధువైపు తిరిగి "గిరిజ ప్రేమని ఆమోదించకపోతే బాధపడుతుందని ఆమె ప్రేమని ఒప్పుకున్నావ్. అప్పుడేమో తల్లిదండ్రులని కష్టపెట్టటం ఇష్టంలేక ఈ సంబంధం ఒప్పుకున్నావ్. ఎప్పుడూ ఎదుటివాళ్ల ఆలోచనలపై, అభిప్రాయాలపై ఆధారపడటం తప్ప నీఅంతట నువ్వేం ఆలోచించవా? స్నేహితులు, తల్లిదండ్రులు, బంధువుల ప్రతి మాటకి తలొంచటం అది వాళ్లపై నీకున్న ప్రేమకి గుర్తు కాదు. గౌరవానికి కొలమానం కానేకాదు. జీవితంలో మనం తీసుకునే ప్రతి నిర్ణయం మనచుట్టూ వున్న అందరికీ ఆనందమైన ఆమోదం కాదు. అంతమాత్రాన మనం మన వ్యక్తిత్వాన్ని వదులుకుంటే ఎలా? గిరిజని తిరస్కరించటం మీవాళ్లకి ఆనందం కావచ్చు. కాని నువ్వు చేసింది అన్యాయం. ఈరోజు శశి మాట విని అమ్మని ఇక్కడ వదిలేస్తానంటున్నావ్. అమ్మకి ఇక్కడ అన్నీ వుంటాయ్. కాని ఇల్లు వుండదు. తన కొడుకు వుండడు. ఇక్కడ నీలా చాలామంది తమ పేరెంట్స్‌ని వదిలి వెళుతుంటారు. ఎంత బాగా చూసినా రోజుకోసారైనా అందరూ వుండి అనాధల్లా బతుకుతున్న ఫీలింగ్ వాళ్లలో కనిపిస్తుంది. మేమేమిచ్చి అది పోగొట్టగలం? న్యాయాన్యాయాలు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవటంలోనే వ్యక్తిలో మానవత్వం కన్పిస్తుంది. వ్యక్తిత్వం

దర్శనం ఇస్తుంది" స్పష్టంగా చెప్పింది రేణుక.

"రేణూ, వూరుకోమ్మా" ఓదార్పుగా ఆమె చేతిని స్పర్శించాడు రాజేంద్ర.

"ఎందుకూరుకోవాలి? అనాధ వృద్ధులకి ఆశ్రయం ఇచ్చి వాళ్లలోని డిప్రెషన్ పోగొట్టవచ్చు. సంతోషంగా వుండేట్టు చూడొచ్చు. కాని ఇదిగో ఇలాంటి కొడుకులు వచ్చి వదిలే పేరెంట్స్‌ని ఏంచేసినా సంతోషపెట్టలేక పోతున్నాను." అని ఓ క్షణం ఆగి, "మధు, ఈ విషయాన్ని ప్రతి కొడుకుకి, నే వివరించలేను. ఆ చనువుండదు కదా. ఒకనాటి మనందరి స్నేహాన్ని గుర్తు పెట్టుకొని చెప్తున్నానిదంతా. ఆలోచించుకో, ఇంకా నీకు అమ్మని జాయిన్ చెయ్యాలని వుంటే తీసుకురా. ఈ హోమ్‌లోకి వచ్చిన వాళ్లెవ్వరినైనా ఆప్యాయంగానే చూస్తాం." అందామె.

మధుకర్ జవాబు చెప్పలేదు.

చెప్పలేదు.

*● ఈనాడు ఆదివారం, 27, అక్టోబర్ 1991 ●*